సాక్షి రంగారెడ్డి

శనివారం । 4 । నవంబర్ । 2023



నేతల పుట్టిల్లు చేవెళ్ల

ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో చేవెళ్లది ప్రత్యేక స్థానం. రాజకీయ నేతలను అందించడంలో విశిష్టమైన గుర్తింపు పొందింది. 10లో▸



టికెట్ అమ్ముకున్నారు

బీజేపీ పెద్దలు షాద్‌నగర్ టికెట్ అమ్ముకున్నారు అని పాలమూరు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి ఆరోపించారు. 10లో▸



గెలుపునకు కృషి చేయండి

కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలని ఎల్‌బీనగర్ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్ అన్నారు. 10లో▸

న్యూస్‌రీల్

ఓటరు కార్డుల పంపిణీకి ఏర్పాట్లు



ఓటరు కార్డులను ప్యాక్ చేస్తున్న సిబ్బంది

తుక్కుగూడ: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం 18 ఏళ్లు నిండిన వయోజనుల నుంచి నూతన ఓటరు కోసం దరఖాస్తులు సేకరించింది. వచ్చిన దరఖాస్తుల ఆధారంగా కొత్తగా ఓటు హక్కు కల్పించి, కార్డులను సిద్ధం చేసింది. ఈనెల 30న ఎన్నికల సందర్భంగా ఓటరు కార్డుల పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.ఈ మేరకు ఓటర్లకు కార్డులు చేరేలా తపాలా కార్యాలయంలోపోస్టు చేయడానికి కలెక్టరేట్‌లో ఏర్పాట్లు చేస్తున్నారు.

రాజకీయ కుట్రతోనే ఐటీ దాడులు

డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

తుక్కుగూడ: మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి గెలుపును ఎవరూ ఆపలేరని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి స్పష్టం చేశారు. రాజకీయ కుట్రతోనే కేఎల్‌ఆర్ ఇల్లు, ఆఫీసులపై ఐటీ దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. తుక్కుగూడలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్, బీజేపీ కలిసి తమ పార్టీ నాయకుల ఇళ్లపై దాడులు చేయించారని మండిపడ్డారు. మంత్రి సబితారెడ్డి నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి శూన్యమని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో హస్తం గుర్తుపై ఓటు వేసి కేఎల్‌ఆర్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దేప భాస్కర్ రెడ్డి, ఏనుగు జంగారెడ్డి, మాధవరెడ్డి, జానకీ రామ్, ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.4.50 లక్షలు పట్టివేత



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

మొయినాబాద్: ఎన్నికల సందర్భంగా పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. మండలంలోని గండిపేట చౌరస్తా వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేసి ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. శుక్రవారం సాయంత్రం ఓ కారులో తరలిస్తున్న రూ.4.50 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. డబ్బులకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో వాటిని సీజ్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ ఏవీ రంగా తెలిపారు.

రూ.1.36 లక్షల నగదు స్వాధీనం

చేవెళ్ల: మండలంలోని అంతారం చెక్‌పోస్ట్ వద్ద శుక్రవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా రూ.1.36 లక్షలు పట్టుబడినట్లు సీఐ లక్ష్మారెడ్డి తెలిపారు. నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవటంతో స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. డబ్బు తీసుకెళ్లేవారు ఆధారాలు వెంట తేవాలని లేదంటే నిబంధనల మేరకు స్వాధీనం చేసుకుంటామన్నారు.

బీఎస్పీలో చేరిన మనోహర్‌రెడ్డి



మనోహర్‌రెడ్డికి పార్టీ సభ్యత్వాన్ని ఇస్తున్న రాంజీగౌతం తదితరుల

మీర్‌పేట: మహేశ్వరం నియోజకవర్గం జిల్లెలగూడకు చెందిన కేఎంఆర్ ట్రస్ట్ చైర్మన్ కొత్త మనోహర్‌రెడ్డి బీఎస్పీలో చేరారు. శుక్రవారం ఆ పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్, ఎంపీ రాంజీగౌతమ్, రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ సమక్షంలో ఆ పార్టీ కండువా కప్పుకొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు పార్టీ సభ్యత్వాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీఎస్పీ చీఫ్ కోఆర్డినేటర్ మంద ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడు లింగం శ్రేరు, ఉపాధ్యక్షుడు దయానంద్‌రావు, జిల్లా ఇన్‌చార్జి మహేశ్‌చారి, మహేశ్వరం నియోజకవర్గ అధ్యక్షుడు గుడ్ల శ్రీను, ప్రధాన కార్యదర్శి భాగ్యరాజ్, ఇన్‌చార్జి గిరి తదితరులు ఉన్నారు.

కొత్త, పాతల త'రంగం'



బీఆర్‌ఎస్ నుంచి అంతా సిట్టింగ్‌లే..

- జీజేపీ, కాంగ్రెస్ తరఫున కొత్త ముఖాలు
- తొలిసారి బరిలో నిలిచిన పలువురు
- అదృష్టాన్ని పరీక్షించుకోనున్న అభ్యర్థులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. అధికార బీఆర్‌ఎస్ అన్ని స్థానాల్లోనూ సిట్టింగ్ అభ్యర్థులకే మళ్లీ ఖరారు చేసిన విషయం విధితమే. కాంగ్రెస్, బీజేపీ గతానికి భిన్నంగా ఈసారి కొత్త ముఖాలను రంగంలోకి దింపాయి. అధికార పార్టీ అభ్యర్థులకు దీటుగా ఆచితూచి అభ్యర్థులను ఎంపిక చేశాయి. రాజకీయ నేపథ్యం ఉన్న ముఖాలే కాకుండా ఆర్థిక, అంగ బలం ఉన్న వారిని బరిలోకి దింపాయి. ఎన్నికల యుద్ధరంగంలో కొత్త, పాత ముఖాలు తలపడనున్నాయి. ఆయా పార్టీల అభ్యర్థులు ఆత్మీయ సమ్మేళనాలు, సభలు, సమావేశాలు, మార్నింగ్ వాక్‌లు, ఇంటింటి ప్రచారాలతో నియోజకవర్గాలు చుట్టేస్తున్నారు. తమకే ఎందుకు ఓటు వేయాలో వివరిస్తూ ఓటర్లను అభ్యర్థిస్తున్నారు.

మహేశ్వరం

అధికార బీఆర్‌ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే సబితారెడ్డి సహా బీజేపీ అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్ మళ్లీ అదే పార్టీల నుంచి పోటీ చేస్తున్నారు. సబిత గతంలో హస్తం గుర్తుపై పోటీ చేయగా, ఈసారి కారు గుర్తుపై బరిలోకి దిగుతున్నారు. మేడ్చల్ నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది, ఈ సారి తాండూరు టికెట్ ఆశించిన కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి మహేశ్వరం నుంచి పోటీచేస్తున్నారు. బీఆర్‌ఎస్,బీజేపీ అభ్యర్థులవి పాత ముఖాలే అ యినప్పటికీ..కాంగ్రెస్ అభ్యర్థి కేఎల్ ఆర్ మాత్రం కొత్తగా ఇక్కడి నుంచి పోటీలో దిగుతున్నారు.

ఎల్బీనగర్

సిట్టింగ్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికే అధిష్టానం మళ్లీ టికెట్ ఖరారు చేసింది. గత ఎన్నికల్లో హస్తం గుర్తుపై గెలుపొందిన సుధీర్‌రెడ్డి.. ఈ సారి కారు గుర్తుపై పోటీ చేస్తున్నారు. గతంలో నిజామాబాద్ ఎంపీగా పని చేసిన మధుయాష్కీగౌడ్ ఈసారి ఎల్బీనగర్ నుంచి బరిలోకి దిగుతున్నారు. గత ఎన్నికల్లో టీడీపీ తరఫున ఇబ్రహీంపట్నం నుంచి పోటీ చేసి ఓటమి పాలైన సామరంగారెడ్డి ఈ సారి బీజేపీ నుంచి రంగంలోకి దిగారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులిద్దరూ తొలిసారిగా ఈ నియోజకవర్గం నుంచి బరిలోకి దిగుతుండటం విశేషం.

షాద్‌నగర్

బీఆర్‌ఎస్ మళ్లీ సిట్టింగ్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌కే టికెట్ ఖరారు చేసింది. కాంగ్రెస్ నుంచి వీర్లపల్లి శంకర్, బీజేపీ నుంచి అందె బాబయ్య బరిలోకి దిగుతున్నారు. వీరిలో కాంగ్రెస్ అభ్యర్థి వీర్లపల్లి శంకర్ గతంలో బీఎస్పీ నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. బీజేపీ అభ్యర్థి అందె బాబయ్య తొలిసారిగా అసెంబ్లీ బరిలో తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు.

చేవెళ్ల

బీఆర్‌ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే కాలె యాదయ్య, బీజేపీ నుంచి మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం బరిలోకి దిగుతున్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓటమి పాలైన రత్నం తర్వాత బీఆర్‌ఎస్‌లో చేరారు. ఇటీవల ఆ పార్టీకి రాజీనామా చేసి, బీజేపీలో చేరి టికెట్ సంపాదించారు. కాంగ్రెస్ కొత్తగా టీపీసీసీ అధికారప్రతినిధి పామెన భీం భరత్‌ను రంగంలోకి దింపింది. ఆయన తొలిసారి అసెంబ్లీకి పోటీ చేయబోతున్నారు.

ఇబ్రహీంపట్నం

బీఆర్‌ఎస్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి. గత ఎన్నికల్లో బీఎస్పీ నుంచి పోటీ చేసి స్వల్ప తేడాతో ఓటమిపాలైన మల్‌రెడ్డి రంగారెడ్డి ఈసారి కాంగ్రెస్ పార్టీ నుంచి బరిలోకి దిగుతున్నారు. బీజేపీ నుంచి కొత్తగా నోముల దయానంద్ గౌడ్ పోటీలో ఉన్నారు. 2013లో ఇంజాపూర్ సర్పంచ్‌గా ఎన్నికైన ఆయన తొలిసారిగా అసెంబ్లీ ఎన్నికల్లో తలపడబోతున్నారు.

శేరిలింగంపల్లి

సిట్టింగ్ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ మూడోసారి పోటీ చేయబోతున్నారు. కాంగ్రెస్ నుంచి మాదాపూర్ కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్ తొలిసారి అసెంబ్లీ బరిలో తన అదృష్టాన్ని పరీక్షించు కోబోతున్నారు. బీజేపీ ఇప్పటికీ ఇక్కడ అభ్యర్థిని ప్రకటించక పోవడం ఆ పార్టీ శ్రేణులను ఆందోళనకు గురి చేస్తోంది.

రాజేంద్రనగర్

సిట్టింగ్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ మళ్లీ అదే పార్టీ నుంచి పోటీలో నిలిచారు. మైలార్‌దేవులపల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాసరెడ్డి తొలిసారి బీజేపీ నుంచి బరిలోకి దిగుతున్నారు. ఆయన 2018లో ఇదే నియోజకవర్గం నుంచి ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. కాంగ్రెస్ నుంచి మణికొండ మున్సిపల్ చైర్మన్ కస్తూరి నరేందర్ ముదిరాజ్ తొలిసారి అసెంబ్లీకి పోటీ చేయబోతున్నారు.

కల్వకుర్తి

బీఆర్‌ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ మళ్లీ పోటీలో నిలిచారు. అధికార పార్టీ నుంచి టికెట్ ఆశించిన ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డికి టికెట్ రాకపోవడంతో ఆ పార్టీని వీడి.. కాంగ్రెస్ నుంచి తొలిసారిగా బరిలోకి దిగారు. గత ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి, ఓటమి పాలైన ఆయన ఈసారి కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తుండటం విశేషం. బీజేపీ తరఫున ఆచారి ఆరోసారి అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు.

బజ్జీలు తినండి.. ఓట్లు వేయండి



కల్వకుర్తి బీజేపీ అభ్యర్థి ఆచారి శుక్రవారం ఆమనగల్లు మున్సిపల్ పరిధిలో ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా విఠాయిపల్లి గ్రామంలోని ఓ హోటల్‌కు వెళ్లి ఇలా బజ్జీలు వేస్తూ ఓట్లు అభ్యర్థించారు. తనను గెలిపిస్తే అందుబాటులో ఉండి పనిచేస్తానని విజ్ఞప్తి చేశారు.

– ఆమనగల్లు

ఎన్నికల పరిశీలకుల నియామకం



మీడియా సెంటర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: అసెంబ్లీ ఎన్నికల నిర్వహణను పర్యవేక్షించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం జిల్లాకు వ్యయ పరిశీలకులను నియమించింది. రెండు నియోజకవర్గాలకు ఒకరు చొప్పున పర్యవేక్షణకు అబ్జర్వర్లను కేటాయించింది. ఈ మేరకు శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇబ్రహీంపట్నం, ఎల్బీనగర్‌కు ప్రియరంజన్ శ్రీవాస్తవ, కల్వకుర్తి, షాద్‌నగర్‌కు వినోద్ కుమార్ అహిర్వార్, మహేశ్వరం, రాజేంద్రనగర్‌కు శంకర్ గుప్తా, శేరిలింగంపల్లి, చేవెళ్లకు జనార్ధన్ నియమితులయ్యారు. నామినేషన్ పత్రాల స్వీకరణ ప్రారంభమైన వెంటనే ఈ అబ్జర్వర్లు క్షేత్ర స్థాయిలో ఎన్నికల నిర్వహణ ప్రక్రియను పర్యవేక్షించనున్నట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. జిల్లాకు చేరుకున్న వ్యయ పరిశీలకులకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భారతి హోళికేరి అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్‌తో కలిసి ఘన స్వాగతం పలికారు. అనంతరం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) సెంటర్‌ను ఎన్నికల వ్యయ పరిశీలకులు పరిశీలించారు. ఎంసీఎంసీ ద్వారా చేపడుతున్న పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలోని రికార్డులను తనిఖీ చేశారు. కంట్రోల్ రూమును పరిశీలించారు.

సుస్మితకు గుజరాత్ కేడర్

ముస్సోరిలో ఐఏఎస్ శిక్షణ పూర్తి చేసుకున్న షాద్‌నగర్ యువతి



షాద్‌నగర్: పట్టణానికి చెందిన సుస్మిత ముస్సోరిలో ఐఏఎస్ శిక్షణ పూర్తి చేసుకుని గుజరాత్ కేడర్‌కు ఎంపికయ్యారు. ఈ మేరకు శుక్రవారం కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. షాద్‌నగర్‌కు చెందిన ఇప్పలపల్లి శ్రీశైలం, లక్ష్మి దంపతులు పట్టణంలో కిరాణ షాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరి కూతురు సుస్మితకు చిన్ననాటి నుంచి చదువంటే మక్కువ. ఐఏఎస్ కావాలనే లక్ష్యంతో ముందుకు సాగిన ఆమె అనుకున్నది సాధించారు.

కుటుంబం.. చదువు

మధ్య తరగతి కుటుంబానికి చెందిన సుస్మిత పదో తరగతి వరకు షాద్‌నగర్‌లోని హెరిటేజ్ వ్యాలీలో చదివారు. అనంతరం హైదరాబాద్‌లోని పేజ్ కళాశాలలో ఇంటర్, వరంగల్‌లోని నీట్‌లో ట్రిపుల్ ఐటీ పూర్తిచేశారు. అనంతరం పబ్లిక్ సర్వీస్‌పై ఆసక్తితో సివిల్స్‌కు సిద్ధమయ్యారు. నాలుగో ప్రయత్నంలో అనుకున్న లక్ష్యం సాధించారు. అఖిల భారత సర్వీసు నియామకాలకు సంబంధించి యూపీఎస్సీ నిర్వహించిన సివిల్ సర్వీసెస్ ఫలితాల్లో 384 ర్యాంకు సాధించారు. ఐఏఎస్‌కు ఎంపికైన ఆమె ఆరు నెలలుగా ముస్సోరిలో శిక్షణ పొందారు. గుజరాత్ రాష్ట్రానికి కేటాయించడంతో త్వరలోనే ఆమె ఏదైనా జిల్లాకు కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, బంధువులు, ఆమెకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

చనిపోయిన ఉపాధ్యాయుడికి ఎలక్షన్ డ్యూటీ



రాంచందర్‌నాయక్ (ఫైల్)



అధికారులు విడుదల చేసిన ఎలక్షన్ డ్యూటీ జాబితాలో రాంచందర్‌నాయక్ పేరు

షాద్‌నగర్ రూరల్: తొమ్మిది నెలల క్రితం చనిపోయిన ఓ ఉపాధ్యాయుడికి ఎన్నికల విధులు కేటాయించారు అధికారులు. ఇందు కోసం శిక్షణకు హాజరు కావాలంటూ జాబితాలో పేరు చేర్చారు. శుక్రవారం విడుదలైన ఈ లిస్టును చూసి అంతా అవాక్కయ్యారు. ఫరూఖ్‌నగర్ మండలం వెలిజర్ల ప్రభుత్వ పాఠశాలలో ఎల్‌ఎఫ్‌ఎల్ టీచర్‌గా పనిచేసిన రాంచందర్‌నాయక్ ఈ ఏడాది ఫిబ్రవరి 9న గుండెపోటుతో మృతి చెందారు. ఇతనికి ఎన్నికల విధులు కేటాయించిన అధికారులు ఐడీ నంబర్‌తో పాటు పేరును చేర్చి ఎలక్షన్ డ్యూటీ లిస్ట్ రిలీజ్ చేశారు. ఇది చూసిన తోటి ఉపాధ్యాయులు విస్తుపోయారు.

సిబ్బందికి సౌకర్యాలు కల్పించాలి

- కలెక్టర్ భారతి హోళికేరి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ భారతి హోళికేరి

ఇబ్రహీంపట్నం రూరల్: అసెంబ్లీ ఎన్నికలకు హాజరయ్యే ఉద్యోగులకు వసతి కల్పించేలా చూడాలని కలెక్టర్ భారతి హోళికేరి సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం సెక్టోరల్ అధికారులతో పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు, పోలింగ్ సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని తెలిపారు. భద్రతా సిబ్బంది, ఉద్యోగులకు అవసరమైన తాగునీరు, విద్యుత్ సరఫరా, ర్యాంపులు, ఫర్నిచర్, టాయిలెట్స్ సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. పట్టణ కేంద్రాల్లో మున్సిపల్ అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఏ పోలింగ్ కేంద్రం వద్ద ఎలాంటి వసతులకు ఆస్కారం ఉందో నివేదిక సమర్పించాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ర్యాంపులను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని, పంచాయతీ ఇంజనీరింగ్ అధికారులు వాటి ఏర్పాట్లను చూసుకోవాలన్నారు. సమావేశంలో విద్యాశాఖ అధికారి సుశీందర్‌రావు, సెక్టోరల్ అధికారులు పాల్గొన్నారు.

గులాబీ జెండా ఎగురవేస్తాం



మంత్రి సబితారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలు

- మంత్రి సబితారెడ్డి

మహేశ్వరం: మహేశ్వరం గడ్డపై గులాబీ జెండా ఎగురవేసి తీరుతామని విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మండల పరిధిలోని హర్షగూడ, పడమటి తండా, కందుకూరు మండల పరిధిలోని సార్లరావులపల్లి, చిప్పలపల్లి గ్రామాలకు చెందిన పలువురు శుక్రవారం బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలు మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్, ఐటీ మంత్రి కేటీఆర్‌తో మాట్లాడి వందల కోట్ల నిధులు తెచ్చి పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామన్నారు. ప్రజలు అభివృద్ధి, సంక్షేమానికి పట్టం కడతారని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, మండల అధ్యక్షుడు అంగోత్ రాజు నాయక్, హర్షగూడ ఎంపీటీసీ విజయ్ నాయక్, ఉప సర్పంచ్ రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కార్యాలయం ప్రారంభం

మీర్‌పేట: ట్రంక్‌లైన్‌తో లెనిన్‌నగర్‌లో ముంపు సమస్యను శాశ్వతంగా పరిష్కరించామని బీఆర్‌ఎస్ మహేశ్వరం నియోజకవర్గ అభ్యర్థి, మంత్రి సబితారెడ్డి తెలిపారు. కార్పొరేషన్ పరిధిలోని లెనిన్‌నగర్ రైతుబజార్ వద్ద శుక్రవారం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన కార్యకర్తలు మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల్లో ప్రజలంతా కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

తొలిరోజు 19 నామినేషన్లు

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌- మల్కాజిగిరి జిల్లాల పరిధిలో శుక్రవారం తొలిరోజు మొత్తం 19 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో హైదరాబాద్ జిల్లా నుంచి ఏడుగురు, రంగారెడ్డి జిల్లా నుంచి ఆరుగురు, మేడ్చల్‌- మల్కాజిగిరి జిల్లా నుంచి ఆరుగురు తమ నామినేషన్లను సంబంధిత నియోజకవర్గాల్లో దాఖలు చేశారు.

హైదరాబాద్ జిల్లాలో..

హైదరాబాద్ జిల్లా పరిధిలో గోషామహల్ నియోజకవర్గం నుంచి మొగిలి సునీత (కాంగ్రెస్), బీవీ రమేశ్‌బాబు (సోషలిస్ట్ పార్టీ-ఇండియా), మలక్‌పేట నుంచి మహమ్మద్ అక్రమ్ అలీఖాన్ (స్వతంత్ర), అంబర్‌పేట నుంచి ఎ. సుదర్శన్ (శివసేన-యూబీటీ), ఖైరతాబాద్ నుంచి షాబాద్ రమేశ్ (స్వతంత్ర), కూరాకుల జ్యోతి (ఎస్‌యూసీఐ- కమ్యూనిస్ట్), సికింద్రాబాద్ నుంచి కె.రాహుల్ గుప్తా (స్వతంత్ర)లు ఉన్నారు.

రంగారెడ్డి జిల్లా పరిధిలో..

శేర్‌లింగంపల్లి జగదీశ్వర్ గౌడ్ (కాంగ్రెస్), చేవెళ్ల కేఎస్ రత్నం (బీజేపీ) ఇబ్రహీంపట్నం సదానందరెడ్డి (పీపుల్స్ ప్రొటెక్షన్ పార్టీ) కల్వకుర్తి బి.రాజు గౌడ్ (స్వతంత్ర) ఎల్బీనగర్ చామకూర రాజయ్య (సోషల్ జస్టిస్ పార్టీ) మంచాల శ్రీకాంత్ ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి ఒక సెట్టు, స్వతంత్ర అభ్యర్థిగా మరో సెట్టు నామినేషన్లు దాఖలు చేశారు.

మేడ్చల్ జిల్లాలో..

మేడ్చల్ స్థానం నుంచి జిన్న శ్రీధర్‌రెడ్డి (స్వతంత్ర), గౌని ప్రవీణ్ కుమార్ రెడ్డి (స్వతంత్ర), మల్కాజిగిరి జాజుల భాస్కర్ (శ్రమజీవి పార్టీ), కూకట్‌పల్లి చంద్రశేఖర్ చలిక (స్వతంత్ర), ఉప్పల్ చిన్న ధనరాజు (స్వతంత్ర), ఎం.మల్లేశం (తెలంగాణ ప్రజా జీవన రైతు పార్టీ)లు నామినేషన్లు దాఖలు చేశారు.



చేవెళ్లలో బీజేపీ అభ్యర్థి కేఎస్ రత్నం తరఫున నామినేషన్ వేస్తున్న ఆయన కుమారుడు



ఉదయం పాండుకు కండువా కప్పుతున్న ఎమ్మెల్యే ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి



రాత్రి బీజేపీలో చేరిన పాండు

ఉదయం కారు.. రాత్రి కమలం

కండువాలు మార్చుతున్న ద్వితీయ శ్రేణి నేతలు

ఎన్నికల నోటిఫికేషన్ వచ్చింది మొదలు బడా నాయకులతో పాటు ద్వితీయ శ్రేణి నేతలు కండువాలు మార్చుతున్నారు. తిప్పాయిగూడ సర్పంచ్, దళితమోర్చా మండల అధ్యక్షుడు శివరాల పాండు గురువారం ఉదయం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. అదే రాత్రి బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దన్నె భాషయ్య సమక్షంలో కమలం కండువా కప్పుకున్నారు. – మంచాల



నేను సైతం..

కల్వకుర్తి అసెంబ్లీ నియోజక వర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేస్తున్న కసిరెడ్డి నారాయణరెడ్డికి మద్దతుగా ఆయన సతీమణి మాధవిరెడ్డి తలకొండపల్లి మండల పరిధిలో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ చేతి గుర్తుకు ఓటేసి తన భర్తను ఎమ్మెల్యేగా గెలిపించాలని అభ్యర్థించారు. – ఆమనగల్లు

నేతల పుట్టిల్లు చేవెళ్ల

• ఉమ్మడి జిల్లాలో చక్రం తిప్పుతున్న అమాత్యులు • అసెంబ్లీ బరిలో ఆరుగురు అభ్యర్థులు

ఎన్నికలనగానే ప్రజల చూపంతా చేవెళ్ల అసెంబ్లీ వైపే.. ఢిల్లీ నుంచి గల్లీ వరకు ఈ సెగ్మెంట్‌పై స్పెషల్ ఫోకస్ చేస్తుంటారు. ఇక్కడ ప్రజలిచ్చే తీర్పునకు అంతటి ప్రత్యేకత ఉంది. ఇక్కడ ఓటర్లు తయారు చేసిన నేతలు ప్రస్తుతం జిల్లాలోని ఆరు సెగ్మెంట్లలో పోటీలో ఉన్నారు.

పార్టీల వారీగా పోటీలో ఉన్నవారు	
కాంగ్రెస్	2
బీఆర్‌ఎస్	3
బీజేపీ	1

చేవెళ్ల: చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గం ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. నగరానికి ఆనుకొని ఉన్న ఈ నియోజకవర్గం రాజకీయ చైతన్యానికి ప్రసిద్ధి. ఓటర్లలో చైతన్యంలోనూ.. జిల్లా వ్యాప్తంగా రాజకీయ నాయకులను అందించడంలోనూ.. విశిష్టమైన గుర్తింపు పొందింది. ఇక్కడి నేతలు పక్క నియోజకవర్గాల్లోనూ తమ ప్రాబల్యం చూపుతూ.. అమాత్య పదవుల్లో ఉన్నారు. ఈ నియోజకవర్గాన్ని పటోళ్ల, పట్నం కుటుంబాలు కంచుకోటగా మార్చుకున్నాయి. సబితారెడ్డి మూడు పర్యాయాలు, మహేందర్‌రెడ్డి రెండు సార్లు మంత్రి పదవిని దక్కించుకున్నారు. వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి సైతం నియోజకవర్గానికి చెందిన వారే. చేవెళ్ల గడ్డ నేతల అడ్డాగా తన ప్రత్యేకతను చాటుతూనే ఉంది.



పట్నం మహేందర్‌రెడ్డి, మంత్రి



పట్నం మహేందర్‌రెడ్డి స్వగ్రామం షాబాద్ మండలంలోని గొల్లూరుగూడ స్వగ్రామం. మేనమామ దివంగత ఇంద్రారెడ్డి ప్రోత్సాహంతో 1994లో టీడీపీ నుంచి తాండూరు నియోజకవర్గం నుంచి పోటీ చేసి అనూహ్యంగా గెలుపొందారు. ఆ తరువాత 1999లో వరుసగా రెండవసారి గెలిచారు. 2004లో ఓటమి చెందగా.. తిరిగి 2009, 2014 ఎన్నికల్లో విజయం సాధించారు. తెలంగాణ రాష్ట్రంలో తొలి రవాణశాఖ మంత్రిగా పనిచేశారు. ఉమ్మడి జిల్లాను శాసించే నాయకుడిగా ఎదిగారు. 2018లో తాండూరు నుంచి పోటీ చేసి ఓటమి చెందడంతో తన తమ్ముడు నరేందర్‌రెడ్డి ఎమ్మెల్సీ స్థానంలో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం మంత్రిగా జిల్లా రాజకీయల్లో కీలక పాత్ర పోషిస్తున్నారు.

పటోళ్ల సబితారెడ్డి, బీఆర్‌ఎస్ మహేశ్వరం ఎమ్మెల్యే అభ్యర్థి



నియోజకవర్గ కేంద్రంలోని కొకుంట్ల సబితారెడ్డి స్వగ్రామం. ప్రస్తుతం ఆమె మహేశ్వరం సెగ్మెంట్ నుంచి బీఆర్‌ఎస్ నుంచి పోటీలో ఉన్నారు. 2000 ఏప్రిల్ 22న తన భర్త రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో పి.ఇంద్రారెడ్డి వారసురాలిగా అప్పటి ప్రతిపక్ష నేత రాజశేఖర్‌రెడ్డి ప్రోత్సాహంతో రాజకీయాల్లోకి వచ్చారు. నియోజవకర్గ చరిత్రలో జరిగిన ఏకైక ఉప ఎన్నికలో ఆమె కాంగ్రెస్ నుంచి పోటీ చేసి అసెంబ్లీ మెట్లెక్కారు. అనంతరం 2004 సాధారణ ఎన్నికలోనూ చేవెళ్ల నుంచి గెలిచిన ఆమె వైఎస్సార్ మంత్రివర్గంలో భూగర్భ, జలవనరుల శాఖామంత్రి పదవి చేపట్టారు. అనంతరం 2009లో జరిగిన సాధారణ ఎన్నికల సమయంలో నియోజకవర్గాల పునర్విభజనలో చేవెళ్ల నియోజకవర్గం ఎస్సీ రిజర్డ్వ్‌గా మారడంతో ఆమె నియోజకవర్గాన్ని వదలాల్సి వచ్చింది. అప్పటి సీఎం వైఎస్సార్ సూచన మేరకు జిల్లాలోని మహేశ్వరం నియోజకవర్గం నుంచి పోటీచేసి దేశంలోనే మొదటి హోం మంత్రిగా రికార్డుకెక్కారు. అనంతరం 2014లో పోటీకి దూరంగా ఉన్నారు. 2018లో కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలుపొంది అధికార బీఆర్‌ఎస్‌లో చేరారు. ప్రస్తుతం విద్యాశాఖ మంత్రిగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం 2023 ఎన్నికల్లో మహేశ్వరం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీలో ఉన్నారు.

కేఎల్‌ఆర్, కాంగ్రెస్ మహేశ్వరం ఎమ్మెల్యే అభ్యర్థి



కేఎల్‌ఆర్ స్వగ్రామం శంకర్‌పల్లి మండల పరిధిలోని మాసానిగూడ. ఈయన సికింద్రాబాద్ డిగ్రీ కళాశాలలో కెమిస్ట్రీ లెక్చరర్‌గా కొంత కాలం పనిచేసి.. అనంతరం బోర్‌వెల్స్ పరికరాలు తయారు చేసే ఫ్యాక్టరీ స్థాపించి వ్యాపారవేత్తగా ఎదిగారు. తన మిత్రుడు పి.ఇంద్రారెడ్డితో విభేదించి రాజకీయాల్లోకి వచ్చారు. 1999లో చేవెళ్ల టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. 2000 జరిగిన ఉప ఎన్నికలో సబితారెడ్డిపై పోటీ చేసి ఓడిపోయారు. అనంతరం హైదరాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చవిచూశారు. దీంతో ఆయన కొంతకాలం రాజకీయాలకు దూరంగా ఉన్నారు. అనతరం వైఎస్సార్ సూచన మేరకు 2009లో మేడ్చల్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా ఖాతా తెరిచారు. ప్రత్యేక రాష్ట్రంలో జరిగిన 2014, 2018 ఎన్నికల్లో మళ్లీ ఓటమి చెందారు. ప్రస్తుతం కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నారు. చేవెళ్ల నియోజకవర్గం బరిలో ప్రత్యర్థులుగా ఉన్న సబితారెడ్డి, కేఎల్‌ఆర్ ప్రస్తుతం మహేశ్వరం సెగ్మెంట్‌లో చేవెళ్ల ప్రాంతవాసులుగా ప్రత్యర్థులుగా మారారు.

పామెన భీంభరత్, కాంగ్రెస్ చేవెళ్ల ఎమ్మెల్యే అభ్యర్థి



షాబాద్ మండలం నారెడ్లగూడకు చెందిన పామెన భీంభరత్ తొలిసారి నియోజకవర్గం నుంచి అసెంబ్లీ రేసులో నిలిచారు. ఏళ్ల నుంచి హస్తం పార్టీకి పనిచేస్తుండగా ఈ ఎన్నికల్లో అభ్యర్థిగా అవకాశం దక్కింది. ఈ ఎన్నికల్లో పామెన విజయం సాధిస్తే చేవెళ్ల నుంచి మరో నాయకుడు వచ్చినట్లే. ప్రస్తుతం ఆరుగురు ఎమ్మెల్యే అభ్యర్థులుగా ఉమ్మడి జిల్లాలోని చేవెళ్ల, మహేశ్వరం, కొండగల్ నియోజకవర్గాలలో శాసనసభ బరిలో నిలిచారు.

పట్నం నరేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ కొడంగల్ ఎమ్మెల్యే అభ్యర్థి



పట్నం మహేందర్‌రెడ్డి సోదరుడు పట్నం నరేందర్‌రెడ్డి. ప్రస్తుతం ఆయన కొంగడల్ ఎమ్మెల్యే. ఈయనది షాబాద్ మండలంలోని గొల్లూరుగూడ స్వగ్రామం. స్థానిక సంస్థల నుంచి ఎంపీపీగా, పీఏసీఎస్ చైర్మన్‌గా రాజకీయ అడుగులు వేశారు. 2010లో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎమ్మెల్సీగా గెలుపొందారు. ఎమ్మెల్సీగా ఉన్న ఆయ న్ను 2018లో టీఆర్‌ఎస్ కొండగల్ అసెంబ్లీ స్థానంలో పోటీ చేయించారు. ఉమ్మడి జిల్లాలో కొత్తగా కలిసి కొడంగల్‌లో చేవెళ్ల నియోజకవర్గ నాయకుడు నరేందర్‌రెడ్డి రేవంత్‌రెడ్డిపై గెలుపొంది గులాబీ జెండా ఎగురవేశారు. ప్రస్తుతం పీసీసీ అధ్యక్షుడి హోదాలో ఉన్న రేవంత్‌రెడ్డిపై రెండోసారి బరిలో నిలుస్తున్నారు.

కేఎస్.రత్నం, బీజేపీ చేవెళ్ల ఎమ్మెల్యే అభ్యర్థి



కొరగాని సాయన్న రత్నం మొయినాబాద్ మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి వాసి. ప్రస్తుతం ఆయన చేవెళ్ల బీజేపీ అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. 1995లో రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్మన్ పదవి ఎస్సీలకు రిజర్వు కావడంతో తెలుగుదేశం పార్టీలోకి తీసుకొచ్చారు. ఇంద్రారెడ్డి అనుచరుడిగా శంషాబాద్ జెడ్పీటీసీ సభ్యుడిగా పోటీచేయించి జెడ్పీచైర్మన్ పదవిని కట్టబెట్టారు. నియోజకవర్గ పునర్విభజనలో చేవెళ్ల స్థానం ఎస్సీ రిజర్డ్వ్ కావడంతో టీడీపీ టికెట్‌పై శాసనసభకు ఎన్నికయ్యారు. 2014లో టీఆర్‌ఎస్ నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2018లో కాంగ్రెస్ నుంచి ఓడిపోయి తిరిగి గులాబీగూటికి చేరారు. 2023లో టికెట్ దక్కకపోవడంతో ఆయన బీజేపీలో చేరి కమలం గుర్తుపై పోటీ చేస్తున్నారు.

కాలె యాదయ్య, బీఆర్‌ఎస్ చేవెళ్ల ఎమ్మెల్యే అభ్యర్థి



ప్రస్తుతం వికారాబాద్ జిల్లాలోని నవాబుపేట మండలం చించల్‌పేటకు చెందిన కాలె యాదయ్య స్థానిక సంస్థల్లో ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుడిగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు. నియోజకవర్గం ఎస్సీకి రిజర్డ్వ్ కావడంతో హస్తం గుర్తుపై పోటీ చేసి ఓటమి చెందారు. 2014లో టీఆర్‌ఎస్ నుంచి బరిలో ఉన్న కేఎస్ రత్నంపై కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొందారు. అనంతరం ఆయన కారెక్కారు. ప్రస్తుతం బీఆర్‌ఎస్ నుంచి పోటీలో నిలిచారు. హ్యాట్రిక్ విజయం కోసం శ్రమిస్తున్నాడు.

బీజేపీ పెద్దలు టికెట్ అమ్ముకున్నారు

- ఇండింపెండెంట్‌గా పోటీ చేస్తా
- నా ఆస్తిలో సగం ప్రజలకు రాసిస్తా
- పాలమూరు ట్రస్టు ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: 'పార్టీ బలోపేతం కోసం ఎంతో శ్రమించా.. పేదల అభ్యున్నతికి సేవా కార్యక్రమాలు చేపట్టా.. కొంత మంది నాపై కుట్రలు పన్ని టికెట్ రాకుండా చేశారు.. బీజేపీ పెద్దలు షాద్‌నగర్ టికెట్ అమ్ముకున్నారు' అని పాలమూరు చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఆయన తన మద్దతుదారులతో కలిసి పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్ మాట్లాడుతూ.. తనకు టికెట్ ఎందుకు ఇవ్వలేదో.. బీజేపీ పెద్దలు చెప్పాలని డిమాండ్ చేశారు. తన ట్రస్టు ఆధ్వర్యంలో నియోజకవర్గ ప్రజలకు ఎంతో సేవ చేశానని గుర్తు చేశారు. షాద్‌నగర్‌లో ఐదువేల ఓటు బ్యాంకు ఉన్న బీజేపీని బలమైన శక్తిగా మార్చేందుకు ఎంతో కృషిచేశానని చెప్పారు. స్వప్రయోజనాల కోసం పాకులాడే వారికే బీజేపీలో పెద్ద పీట వేస్తున్నారని ఆరోపించారు. స్థానిక నేతలు పార్టీలో ఎన్నో అవమానాలకు గురిచేసినా భరించానని, పేదల సంక్షేమ కోసం, పార్టీ అభివృద్ధి కోసం ట్రస్టు ఆధ్వర్యంలో ఇప్పటి వరకు రూ.27 కోట్లు ఖర్చు చేశానని వివరించారు. తాను ధర్మం, న్యాయం కోసం పోరాటం చేస్తానని, అందరూ ఆశీర్వదిస్తే ఇండిపెండెంట్ అభ్యర్థిగా బరిలో ఉంటానని వెల్లడించారు. ఇక నుంచి జెండాలు, ఎజెండాలు పక్కన పెట్టి ప్రజల ఎజెండానే తన జెండాగా సాగుతానని తెలిపారు. నామినేషన్ వేసిన రోజు తన ఆస్తిపాస్తులకు సంబంధించిన వివరాలు వెల్లడిస్తానని, ఆరోజు తన సగం ఆస్తిని ప్రజలకు రాసిస్తానని ప్రకటించారు.

పార్టీ గెలుపునకు కృషి చేయండి

• పీసీసీ ప్రచార కమిటీ ఛైర్మన్, ఎల్‌బీనగర్ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్

తుర్కయంజాల్: ఇబ్రహీంపట్నం, ఎల్‌బీనగర్ నియోజకవర్గాల్లో కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పార్టీ గెలుపునకు కృషి చేయాలని పీసీసీ ప్రచార కమిటీ ఛైర్మన్, ఎల్‌బీనగర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్ అన్నారు. తుర్కయంజాల్ మున్సిపల్ పరిధి మన్నెగూడలోని ఓ కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, గెలుపును ఆపడం ఎవరి తరం కాదని అన్నారు. టికెట్ రాని వారు అసంతృప్తికి లోనుకావద్దని, పార్టీ అధికారంలోకి వచ్చాక ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందని తెలిపారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. కార్యకర్తలు ఎన్నికల వరకు కష్టపడి పనిచేయాలని, అధికారంలోకి వచ్చాక ప్రతి ఒక్కరినీ ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. శనివారం ఉదయం 7.45 గంటలకు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో దేవాలయాలు, చర్చి, మసీదుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ప్రచారం ప్రారంభించాలని కోరారు. ఈనెల 9న నామినేషన్ వేస్తానని, పెద్ద ఎత్తున తరలి వచ్చి ఐక్యత చాటాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్ పర్సన్‌లు మల్‌రెడ్డి అనురాధ, కొత్త ఆర్తిక, కప్పరి స్రవంతి, వైస్ ఛైర్ పర్సన్ హరిత, మాజీ ఎమ్మెల్యే కోదండ రెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మధుయాష్కీ గౌడ్